# కన్యాశుల్కం చిత్రంలోని సాంకేతిక విలువలు

'కన్యాశుల్కం' నాటకాన్ని దృశ్య, శ్రవ్య నాటక రచనల సమ్మిశ్రితంగా గురజాడ రూపొందించారు. చిత్రలేఖనంలో ప్రావీణ్యం ఉన్న ఆ మహానుభావుడు, 'భాసుడి' వలె రంగస్థలం మీద విప్లవాత్మకమైన దృశ్యాలను ప్రవేశపెట్టి, తన విలక్షణతను చాటుకున్నారు. చలనచిత్రంగా నిర్మించే సమయంలో కళాదర్శక, ఛాయాగ్రహణాది సాంకేతిక నిపుణులను, గురజాడ విప్లవ ధోరణులు అగ్నిపరీక్షకి గురిచేస్తాయి. ఉదాహరణకి, ప్రథమాంకాన మొదటి స్థలాన్ని తీసుకోండి! గురజాడవారు చల్లచల్లగా 'విజయనగరంలో బొంకులదిబ్బ' – అని అనేసారు. ఎక్కడో 'మద్రాసు' మహానగరంలో కడుపులో చల్ల కదలకుండా కాలక్షేపం చేస్తూన్న కళాదర్శకులకు, ఆ స్థలంతో ఏమి పరిచయం వుంటుంది? ఆ స్థలాన్ని వారు సినిమాలో 'సెట్టింగ్' రూపంలో ఎలా పునఃసృష్టి చేయగలరు? కళాదర్శకుడిని కఠోర పరిశ్రమకు గురిచేయడం యిష్టంలేని నిర్మాత, దర్శకాదులు, రచయిత నెత్తిన స్వారీ చేస్తూ, ఆ దృశ్యం మొత్తం ఎత్తివేయించి, తమకి (కళాదర్శకుడికి కూడా) ఏమాత్రం కష్టంలేని, మధురవాణి పడకగదిలో మొదటి సన్నివేశాన్ని రచింపజేస్తారు. ఇలా తమ పనిని నిర్మాత, దర్శకద్వయం సులభతరం చేసుకుంటూపోయినప్పుడు, కళాదర్శకుడు పరిశోధన చేయవలసిన అవసరం ఏముంటుంది? 'యావత్తైలాతావద్వ్యాఖ్యానం' అన్నవిధంగా, కళాదర్శకుడు ఎవరైనా, తమకి యిచ్చిన పరిధుల మేరకి లోబడి, సినిమా బడ్జెట్‌ని దృష్టిలో పెట్టుకొని, చేయవలసిన కళాదర్శకత్వమేదో చేసేసి, చేతులు దులుపుకుంటాడు. ఛాయాగ్రాహకుడు అయినా ఇదే తంతు! ఇటువంటి అవకతవకలను దృష్టిలో పెట్టుకొని మరీ ఈ చిత్రంలోని కళాదర్శకత్వ, ఛాయాగ్రహణాది సాంకేతిక విలువల తీరుతెన్నులను పరిశీలించవలసి వుంటుంది! అందుకు ఒడంబడి, ముందుగా కళాదర్శకత్వపు స్థితిగతులు ఏవిధంగా వున్నాయో చూద్దాము!

**కళా దర్శకత్వము**

దాదాపు అరవై ఏళ్ళ క్రితం, ప్రజాభిమానం కారణంగా, నటీనటులకు కలిగే యిబ్బందులను దృష్టిలో ఉంచుకొని, శబ్దగ్రహణాది సాంకేతికాంశాలలో కలిగే అవరోధాలను గుర్తు పెట్టుకొని, అధిక శాతం చిత్రాలను అవుట్ డోర్ షూటింగ్‌కి వెళ్ళకుండా, స్టూడియోలలోనే చిత్రీకరించేవారు. 'కన్యాశుల్కం' చిత్రాన్ని కూడా ఈ ఆనవాయితీకి అనుగుణంగా మద్రాసులోని ప్రముఖ స్టూడియోలలో రూపొందించడం జరిగింది. ఈ చిత్రం నిమిత్తం ఒకటీ, రెండూ కాదు, నాలుగు స్టూడియోలలో నిర్మాణ కార్యక్రమాలను జరిపారు. ఆ స్టూడియోలు – రేవతి, నరసూ, వీనస్, నెప్ట్యూన్ స్టూడియోలు. ఈ స్టూడియోలలోనే ప్రముఖ కళాదర్శకులు 'వాలి', 'గోడ్ గాంకర్'లు తగిన సెట్టింగులను నిర్మించారు. గురజాడ తమ నాటకంలో పేర్కొన్న 'బొంకులదిబ్బ', 'కాళీమందిరం', 'చెరువుగట్టుతోట' మొదలగు స్థలాలను అన్నింటినీ సినిమా స్క్రిప్ట్‌లో రచయిత సదాశివ బ్రహ్మం పరిహరించడం వలన, కళాదర్శక ద్వయానికి పని తేలిక అయింది. ఉన్నంతలోనే... అంటే, బడ్జెట్ పరిమితులకు లోబడి, సంతృప్తికరమైన రీతిలో, ఆ ఉభయులూ కళాదర్శకత్వాన్ని నిర్వహించారు. మధురవాణి పడకగదిలో పట్టుజాలరుల తెర ఉన్న పందిరి మంచము, ఇనుప గొలుసుల ఉయ్యాలబల్ల, మంచం ప్రక్కన ముక్కాలిపీట, గోడమీద పురాణ దృశ్యాల పటాలు, గూళ్ళల్లోని మట్టిబొమ్మలు వంటి వస్తుసామగ్రి చిత్రంలోని కాలాన్ని, సామాజిక పరిస్థితులను ప్రతిబింబింపజేసేవిగా ఉన్నాయి. అదేవిధంగా, పూటకూళ్ళమ్మ యింట్లో గోడకి జారవేసిన పీటలు, చెంబులు, పాత్రలు వంటి సరంజామా అంతా అక్కడి వాతావరణానికి అద్దం పట్టేవిధంగా ఉన్నాయి. అగ్నిహోత్రావధాన్లు ఇంట్లో పూజాగది, భోజనాలగది, సామాన్లకొట్టు మొదలైన స్థలాలన్నీ నిర్దుష్టంగా రూపొందించడం జరిగింది. అయితే, కళాదర్శకత్వంలో లోపాలు లేకపోలేదు. మధురవాణి పడకగదిలో గోడమీద గిరీశం, మధురవాణి కలిసి తీయించుకున్న ఫోటో ఫ్రేమ్ కట్టి, తగిలించబడి వుండడం దోషం! ఎందుకంటే, ఆ తరువాత సన్నివేశంలో ఫోటోగ్రాఫ్ పంతులు అదే సైజు ఫోటోని తీసుకొని, పూటకూళ్ళమ్మ ఇంటికి వస్తాడు. గిరీశానికి ఆ ఫోటోని ఇచ్చేసి, తన డబ్బును వసూలు చేసుకోవాలన్నది, ఆ

పంతులు సంకల్పం! 'నాగులచవితి' పాట సందర్భంలో, వూరి చివర తోటలోని పుట్ట సెట్టు చాలా యిరుకుగా, కృతకంగా ఉంది. ఆ విధంగానే గిరీశం పాట సన్నివేశంలో అగ్నిహోత్రావధాన్లు ఇంటి వెనుక పెరడు, పెరట్లో జామిచెట్లు చాలా కృత్రిమంగా ఉన్నాయి. కాస్త విశాలంగా సెట్టును నిర్మించి వుండుంటే బాగుండేది. రామప్పంతుల యిల్లు, లుబ్ధావధాన్ల యిల్లు సెట్టింగ్స్ (కూడా) బాగున్నాయి. మొత్తం మీద కళాదర్శకత్వం 'ఫర్వాలేదు' - అనిపించే స్థాయిలో మాత్రమే వుంది.

ఛాయాగ్రహణం

గురజాడవారికి ఛాయాగ్రహణం గురించి బాగానే పరిచయం ఉంది. అయినా, ఆయన తమ 'కన్యాశుల్కం' నాటకంలో కెమేరా కన్నుకి అందనివీ, కేవలం మనోనేత్రంతో మాత్రమే చూడగలిగినవీ అయిన కొన్ని సన్నివేశాలను రచించి, ఛాయాగ్రాహకులకు ఒక గొప్ప సవాల్‌ని విసిరారు. 'కన్యాశుల్కం' చిత్రానికి ఛాయాగ్రాహకుడు 'ఎన్.ప్రకాశ్'. ఆయన ఈ చిత్రానికి ఛాయాగ్రహణపు బాధ్యత తీసుకొనేముందు, 'కన్యాశుల్కం' నాటకాన్ని చదివారో, లేదో తెలియదు! ఈ నాటకం కళాదర్శకులకే కాదు, ఛాయాగ్రాహకులకు కూడా అగ్నిపరీక్షని పెడుతుంది. ఉదాహరణకి, శతాబ్దిక్రితం, 'బొంకులదిబ్బ దగ్గర సాయంకాలన్ని చిత్రీకరించాలంటే, ఆ సమయాన, లైట్‌ని గురించి పూర్తిగా అవగాహన అవసరం! 'బొంకులదిబ్బ దగ్గర ఎటు సూర్యాస్తమయం జరుగుతుందో, 'అస్తమయ సూర్యుని కాంతిని రాజుగారి కోట ఏ మేరకి అడ్డుకుంటుందీ, 'ఆ సమయానికి వీధి దీపాలను వెలిగించేవారా, లేదా?' – ఇటువంటి పలు విషయాలను (లైట్‌కి సంబంధించిన మేరకు) సునిశితంగా అధ్యయనం చేయవలసి వుంటుంది. కాలం ప్రధాన పాత్రని వహించే 'కన్యాశుల్కం' వంటి సాంఘిక నాటకంలో, కాలానికి ప్రాతినిధ్యాన్ని వహించే కాంతి ప్రాధాన్యం చెప్పనలవి కానంతగా ఉంది, ఉంటుంది! ఆ కాంతి ప్రాముఖ్యాన్ని విస్మరించినట్లయితే, చిత్రంలోని జీవశక్తి నశించక మానదు!

ప్రకాశ్ చిత్రారంభంలోనే కాలాన్నీ, కాంతినీ విస్మరించాడు. రాత్రికీ, పగలుకీ తేడాని పట్టించుకోవడం మానేసాడు. సాఫ్ట్ లైట్ ఉండవలసిన సన్నివేశాలలో హార్డ్‌లైట్‌ని వాడి, దృశ్యంలోని సహజ సౌందర్యాన్ని దారుణంగా దెబ్బతీసాడు. నాగులచవితి పాట సందర్భంలోనూ, 'గిరీశం' పాట సందర్భంలోనూ, బొమ్మలపెళ్ళి పాట సందర్భంలోనూ, లైట్ ఒకేవిధంగా వుంటుంది, ఎటువంటి వైవిధ్యమూ లేకుండా లైబ్రరీ షాట్స్‌తోగాని, బ్యాక్ ప్రొజెక్షన్‌తోగాని అవుట్‌డోర్‌లో చిత్రీకరించిన ఎఫెక్ట్‌ని ఆయన తీసుకొని రావచ్చును! కాని, ఆయన ఆ ప్రయత్నం చేయలేదు! ఉన్నంతమేరలో 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' పాత్రని ధరించిన 'కుమారి ప్రమీలారాణి' ముఖంలో ముదురుతనాన్ని పట్టించుకోకుండా, అతి దగ్గరలో కెమేరాని పెట్టి, క్లోజప్ షాట్లు తీసి అటు ఆ నటినీ, ఇటు ప్రేక్షకులనూ యిబ్బంది పెట్టడం సబబుగా, లేదు! మధురవాణి మేజువాణి సందర్భంలో, ఆదిలోనే సిల్హౌట్‌ని చూపించిన తీరు ప్రశంసనీయం! ప్రకాశ్ ఛాయాగ్రహణం చిత్రానికి క్రొత్త సొబగులను తేకపోవచ్చు! కాని, చిత్రాన్ని చెడగొట్టనైతే, చెడగొట్టలేదు! సౌజన్యారావు పంతులు కచ్చేరీ గదిలో నున్న ఆనందగజపతిరాజు గారి తైలవర్ణ చిత్రమే యిందుకు గొప్ప సాక్ష్యం!!!

**నృత్య దర్శకత్వం**

'కన్యాశుల్కం' చిత్రానికి నృత్యదర్శకుడు 'పసుమర్తి కృష్ణమూర్తి'. ఆయన కేవలం నృత్య దర్శకుడు మాత్రమే కాదు, చక్కని నర్తకుడు కూడా! 'పాతాళభైరవి' (1951) చిత్రంలో, ఆయన సావిత్రితో కలిసి – "నే రానంటే రానే రాను!" – అనే పాటలో నృత్యాన్ని చేసారు. ఆ నృత్య సన్నివేశంలో సన్నగా రివట్లావున్న సావిత్రి, గట్టిగా నాలుగేళ్ళు తిరగకముందే బాగా లావైపోయింది. చిత్రంలో సావిత్రిది వేశ్య పాత్ర గనుక, 'కన్యాశుల్కం' చిత్రంలో మధురవాణికి నృత్యాలను పెట్టడం తప్పనిసరి! ప్రేక్షకులు కూడా ఆమె నృత్యాలను ఆశిస్తారు. అయితే, సావిత్ర శరీరం క్లిష్టమైన నృత్యాలకు సహకరించదు! ఆ కారణంగా, పసుమర్తి కృష్ణమూర్తి మధురవాణి నృత్యాలను కంపోజ్ చేసేటప్పుడు, ఎంతో జాగ్రత్త వహించవలసి వచ్చింది. కఠోర సాధనతో నిమిత్తం లేని ఆంగికాభినయం, ముఖ కవళికల ద్వారా హావభావ ప్రదర్శన, కర చరణాదుల ద్వారా తేలికైన

ముద్రలను పట్టడం వంటివాటితో, కృష్ణమూర్తి మధురవాణి నృత్యాలను ఎంతో సరళీకృతం చేసారు. ఆమె మొదటి నృత్యం గిరీశం ముందు, తన పడక గదిలో – "సరసుడ దరి జేరరా..." అనే జావళికి చేసినది! ఇక ఆమె రెండవ నృత్యం, లుబ్ధావధాన్ల వివాహ సందర్భాన చేసిన మేజువాణి. 'శ్రీరంజని' రాగంలో స్వరపరచిన జావళిలో సావిత్రి తన నేత్ర, కరచలనాదులతో నృత్యాభినయాన్ని బాగా చేసింది. ఆమె నృత్యం, నాట్యాభిమానుల ప్రశంసలను అందుకునే స్థాయిలో ఉందంటే, ఆ క్రెడిట్‌లో సగం పసుమర్తివారికి కూడా చెందుతుంది. ఇక మధురవాణి చేసిన రెండవ నృత్యం 'శ్రీశ్రీ' రాసిన 'మహాప్రస్థానం'లోని గీతానికి 'వి.ఎ.కె.రంగారావుగారు' అభిప్రాయడినట్లుగానే "మేజువాణికి ఆనందం అర్ణవమైతే..." గీతం తగదు! ఆ వస్తువుకీ, మేజువాణీకి చుక్కెదురు!" – అయితే, దర్శక, నిర్మాతలదే తుది నిర్ణయమైనందువల్లా, నృత్యగీతాల ఎంపికలో నృత్య దర్శకుడు అస్వతంత్రుడు అయినందువల్లా, ఈ విషయంలో కృష్ణమూర్తిగారిని తప్పుపట్టలేము! పాటలోని సాకీలవల్లా, కరతాళ ధ్వనుల వల్లా, ఈ నృత్యగీతానికి, ఉత్తర భారత నాట్య సాంప్రదాయపు రంగు వచ్చింది. ఖవాలీకి, ముజ్రాకి సాంకర్యజన్యం వలె వుంది, ఈ నృత్యపు కంపోజిషన్. కఠినమైన పరిశ్రమ అగత్యంలేని ఈ నృత్యాభినయాన్ని సునాయాసంగా చేసి, ప్రేక్షకులను రంజింప చేయగలిగింది.

'దేవులపల్లివారు' రచించిన 'బొమ్మలపెళ్ళి' పాటకి నర్తించేవారు బాలికలైనందువల్ల, కృష్ణమూర్తిగారు అతి సరళమైన రీతిలో నృత్యాన్ని కంపోజ్ చేయడం జరిగింది. ఈ పాటలో నృత్యాభినయాన్ని చేసిన ఆడపిల్లలందరూ (ఒకే మగపిల్లవాడు ఉంటాడు, ఈ పాటలో!) 'బాలానందం' సంఘం సభ్యులే కావడం విశేషం! ఇక చిత్రాంతంలో వచ్చే 'కీచకవధ' వీధి బాగవతం, 'కూచిపూడి' నాట్య సాంప్రదాయానికి చెందినదవటం వలన, కృష్ణమూర్తిగారు ఆ సాంప్రదాయంలో నిష్ణాతులయిన కారణాన, 'చాలా బాగుంది' – అంటే అది తక్కువచేసి చెప్పటమే అవుతుంది. 'పూర్ణమ్మ'ని బుర్రకథగా చిత్రించడం వలన, కథకుడు మోపర్రుదాసుకి బుర్రకథాగానంలో అభినివేశం ఉండడం వలన, ఆ కథాగేయం, బుర్రకథగా కూడా బాగా రక్తి కట్టింది.

**అలంకరణ**

'కన్యాశుల్కం' చిత్రానికి 'హరిపాద చంద్ర', 'వాసు', 'నాగేశ్వరరావు' లనే ముగ్గురు రూపశిల్పులు నటీనటుల అలంకరణ బాధ్యతని వహించారు. ఈ ముగ్గురూ 'గిరీశం' పాత్రని ధరించిన ఎన్.టి.ఆర్. అలంకరణపట్ల అంత శ్రద్ధ వహించకపోయినా, మధురవాణి అలంకరణ పట్ల అలక్ష్యం వహించలేదు! బాల విధవలయిన బుచ్చెమ్మ, మీనాక్షి, పూటకూళ్ళమ్మల అలంకరణ విషయాన వీరు వైవిధ్యాన్ని కనపరిచారు. లుబ్ధావధాన్లు, రామప్పంతులు వంటి విప్రుల ఆహార్యాన్ని, ఆయా సమయాలూ, సన్నివేశాలకూ అనుసగుణంగా సమకూర్చారు. పూర్ణమ్మ, ఆమె తల్లిదండ్రులు, అన్నావదినెలు వంటి చిన్నపాత్రలను సైతం కథాకాలానుగుణ్యంగా, ఈ రూపశిల్పిత్రయం అలంకరించి, తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించారు.

**దుస్తులు**

'కన్యాశుల్కం' చిత్రంలో శ్రోత్రీయ బ్రాహ్మణులు, వైశ్యుడు, పోలీసులు, బాలవిధవలు, గృహిణులు, బాలికల వంటి విభిన్న పాత్రలు చాలా ఉన్నాయి. ఆ పాత్రలకు, కథా కాలానికి అనువైన దుస్తులను ఎంపిక చేయడమన్నది ఏమంత సామాన్యమైన వ్యవహారం కాదు! దర్శకుని యిష్టాయిష్టాలకూ, నటీనటుల వ్యక్తిగతాభిప్రాయాలకూ తలొగ్గి పని చేయవలసిన శాఖ యిది! స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కరువైన పరాధీనులు చేసే దోషాలు క్షంతవ్యాలు! అందువల్ల, గిరీశానికి మెళ్ళో నైలాను రుమాలును కట్టినా, మీనాక్షికి అంచుల చీరలను కట్టినా, ఈ దుస్తుల శాఖని నిర్వహించిన 'అచ్యుతరావు'ను మన్నించక తప్పదు!

**శబ్ద గ్రహణము**

'కన్యాశుల్కం' చిత్రానికి – 'కె.రామచంద్రన్', 'టి.ఎస్.రంగసామి', 'ఎస్.శేషాద్రి', 'సూర్యనారాయణ' – అనే నలుగురు శబ్దగ్రాహకుల పని చేసారు. గురజాడకి శబ్ద జ్ఞానం అపారం గనుక, ఆయన తమ నాటకంలో 'ధ్వన్యనుకరణ' (వెంట్రిలాక్విజం) వంటి టెక్నిక్కులను బాగా వినియోగించుకున్నారు. చిత్రం

కోసం, శబ్ద గ్రాహక చతుష్టయం వినూత్న ప్రయోగాలను ఏమీ చేయకపోయినా, చిత్రీకరణలో సముచితమైన 'ఎఫెక్ట్స్'ని బాగా తీసుకొనివచ్చారు. ఉదాహరణకి, బావిలో దూకే ముందు, ఆ గ్రామంలో రాత్రివేళ, దూరాన జరిగే 'పూర్ణమ్మ' బుర్రకథని చెప్తూన్న గాయకుల హృదయ విదారకాలాపనలను నేపథ్యంలో వినిపించిన తీరు ప్రశంసనీయంగా ఉంది. అదేవిధంగా, బావిలో దూకిన వెంకమ్మని గిరీశం కాపాడే సన్నివేశంలో, బుచ్చెమ్మ, సుబ్బి, కరటకశాస్త్రి వంటి కుటుంబసభ్యుల ఆక్రందనలూ, అరుపులూ వంటి గందరగోళపు వాతావరణాన్ని, శబ్ద సమ్మేళనం (సింక్రనైజేషన్ ఆఫ్ వేరియస్ సౌండ్స్) ద్వారా ఎఫెక్టివ్‌గా, వీనులకి వినిపించారు. ఈ విషయంలో శబ్దగ్రాహకుల కృషి అభినందనీయం!

**కూర్పు**

'కన్యాశుల్కం' నాటకాన్ని చలనచిత్రంగా రూపొందించడమన్నదే ఒక సాహసం అయితే, ఆ చిత్రానికి 'ఎడిటింగ్' (కూర్పు) బాధ్యతని వహించడం అన్నది అంతకుమించిన సాహసం! అగ్గిపెట్టెలో ధక్కా మజ్లిన్ చీర యిమిడ్చిన నేత పనివారి నైపుణ్యంతో సరిసమానమైన ప్రావీణ్యం, ఆ సినిమా కూర్పరికి ఉండాలి! 'కన్యాశుల్కం' చిత్రానికి ఎడిటింగ్‌ని నిర్వహించిన ఆర్.హనుమంతరావు, పండితులకే గాక, పామరులకి సైతం కథని సులభంగా అర్థం చేసుకొని, ఆస్వాదించేందుకు ఎటువంటి అవరోధాలూ లేకుండా, తన పనిని నిర్వహించారు. విమర్శకులు ఎవరయినా అంతకుమించి ఆయన నుండి ఆశించేదేముంది? చిత్రాంతాన 'కీచకవధ' వీధి భాగవతాన్ని కొద్దిగా కత్తిరించివుంటే, సినిమాని అనవసరంగా సాగదీసారన్న భావన సామాన్య ప్రేక్షకులకు కలిగేది కాదు!

**రచన, సమీకరణ**

'కన్యాశుల్కం' నాటకాన్ని తెరకనువదించడమన్నది కొండను అద్దంలో చూపడం వంటి సంక్లిష్ట కార్యం! ఈ కష్టసాధ్యమైన కార్యాన్ని 'సదాశివ బ్రహ్మం' శ్రమకోర్చి, సక్రమంగా నిర్వహించారు. అయితే, ఆ కార్యనిర్వహణలో ఆయన నాటకంలోని ఎన్నెన్నో రసవత్తరమైన సన్నివేశాలను నిర్దాక్షిణ్యంగా తీసివేయవలసి వచ్చింది. ఆ కారణంగా, పేకాట సన్నివేశం, సారాకొట్టు సన్నివేశం, కోర్టు సన్నివేశాలు చిత్రంలో కనిపించవు. బైరాగి, యోగిని, హవల్దారు వంటి అద్భుతమైన పాత్రలు చిత్ర విచిత్రంగా చిత్రంలో మటుమాయమైపోయాయి. అయితే, ఏమాటకామాటే చెప్పుకోవాలి! ఈవిధంగా చేయడంవల్ల... అంటే, పలు పాత్రలనూ, వాటి సంభాషణలనూ పరిహరించడంవల్ల, కథాగమనం ఎక్కడా కుంటుపడకుండా, వేగంగా సాగిపోయింది. గురజాడ సృష్టించిన పాత్రలు సజీవంగా మన కళ్ళెదుట నడయాడే మనుష్యుల్లా ఉంటాయి. కాని, పెద్ద కేన్వాస్ మీద చిత్రించిన మిణుగురు పురుగుల్లాగ, సినిమాలోని పలు పాత్రలు, ఓ మెరుపు మెరిసి, అదృశ్యమైపోతాయి. ఉదాహరణకి కానిస్టేబుల్, పోలిసెట్టి వంటి పాత్రలను పేర్కొనవచ్చును. పూటకూళ్ళమ్మ, ఫోటోగ్రాఫ్ పంతులు, గవరయ్య, సిద్ధాంతి వంటి పలు పాత్రల ప్రవేశ, నిష్క్రమణలకి ఒక నిర్దిష్ట ప్రయోజనమూ, ఒక ఖచ్చితమైన క్రమమూ నాటకంలో వలె, సినిమాలో కనిపించవు. జీవం లేని తోలుబొమ్మల చందంగా, ఇవి చిత్రంలో వచ్చిపోతాయి. గురజాడ 'సుబ్బి'ని నాటకారంభం నుంచి, అంతంవరకూ, ఒక అదృశ్యపాత్రగా ఉంచి, విచిత్రమైన ప్రయోగాన్ని చేయగా, ఆ ప్రయోగానికి నీళ్ళొదిలి, చిత్రంలో, అనవసరంగా సుబ్బిని చూపించడం జరిగింది. సౌజన్యారావు పంతులు భార్య ప్రయోజనరహితమైన పాత్ర గనుక, చిత్రంలో ప్రవేశపెట్టకుండా వుంటే బాగుండేది. కథా వస్తువుకి అనుగుణంగా, చొప్పించిన 'పూర్ణమ్మ' బుర్రకథ బంగారానికి తావిని చేకూరినట్లుగా, ఈ చిత్రానికి అందం తెచ్చింది. అయితే, చిత్రాంతంలోని 'కీచకవధ' వీధి భాగవతం అనవసరపు పొడిగింపు అనిపిస్తుంది. నాటకాభిమానులను నిరాశపరిచినా, సదాశివబ్రహ్మం కూర్చిన సన్నివేశాలనుక్రమణిక (సీసిక్ ఆర్డర్స్), సామాన్యులను రంజింపజేసేవిధంగా ఉంది. అదే పదివేలు!

**దర్శకత్వం**

'వినోదా' పిక్చర్స్ అధినేతలలో ఒకరైన డి.ఎల్.నారాయణ, వినోదా పతాకంపై నిర్మించిన మూడు చిత్రాలకూ దర్శకుడిగా 'వేదాంతం రాఘవయ్య'నే తీసుకున్నారు. అయితే, వినోదా సంస్థ భాగస్వాములలో

ఒకరైన రాఘవయ్య, అ సంస్థ నుంచి తప్పుకోవడంతో, 'కన్యాశుల్కం' చిత్రానికి 'పి.పుల్లయ్య'ను దర్శకునిగా తీసుకోవలసి వచ్చింది. పుల్లయ్యకి విజయనగరపు సంస్కృతిని గురించి పట్టులేని వ్యక్తే అయినా, చాలా శ్రద్ధగా ఈ సినిమాకి పనిచేసారు. ఎంత నిబద్ధతతో పని చేసినా, ఎందుకనో మొదటి నుంచి ఆయనకు ఈ చిత్ర విజయం మీద నమ్మకం వుండేది కాదు. 'సినిమాగా ఇది జనానికి నచ్చేదేమో'నని తరచు ఆయన అంటూండేవారు. ఒక నిర్దిష్ట స్థల కాలానికి చెందిన 'కన్యాశుల్కం' నాటకాన్ని గురించి నెల్లూరుకి చెందిన పుల్లయ్యకి సంపూర్ణమైన అవగాహన లేకపోవడం వలన, ఆ నాటకాన్ని చిత్రంగా మలిచే ప్రక్రియలో, ఆయన తెలిసో, తెలియకో పలు పొరపాట్లను చేసారు. ఈ చలనచిత్రం ఆద్యంతం దొర్లిన ఆ పొరపాట్లు, పరమాణ్ణంలో పలుగురాళ్ళలా 'కన్యాశుల్కం' నాటకాభిమానులను చాలా బాధిస్తాయి. ఉదాహరణకి, ఫోటోగ్రాఫ్ పంతులు, పూటకూళ్ళమ్మ యింటికి వచ్చి, ఫోటోని చూపించడానికి ముందే, ఆ ఫోటో ఫ్రేమ్‌తో సహా మధురవాణి యింట్లోని పడగ్గది గోడ మీద ప్రత్యక్షం కావడం, 'బొమ్మలపెళ్ళి' పాట దగ్గర బాల్య వివాహాన్ని ఘనంగా చూపడం, అవుట్ డోర్‌లో తీయవలసిన పలు సన్నివేశాలను స్టూడియోల్లో తీయడం, స్వతంత్ర జీవి అయిన పూటకూళ్ళమ్మ సౌజన్యారావు పంతులు యింట్లో పని మనిషిగా చేరడం, సుబ్బి పెళ్ళిని మహేశంతో ఖాయపరచడం మొదలగు దోషాలను పేర్కొనవచ్చును! ఈ దోషాల ఫలితంగా, ఎంతగానో వూహించుకున్న ప్రేక్షకులు సినిమాని చూసి పెదవి విరిచారు. 'నాటకం పరువూ, గురజాడ పరువూ తీసేసార'ని విమర్శకులు ఘాటుగా విమర్శించారు. డి.ఎల్.నారాయణకి సన్నిహితుడయిన పేకేటి శివరామ్ "హీరో (ఎన్.టి.ఆర్), దర్శకుల (పి.పుల్లయ్య) ఎంపికలో చేసిన పొరపాట్లవల్లే 'కన్యాశుల్కం' సినిమా ఆడలేదని "వేదాంతం రాఘవయ్యకు దర్శకత్వం అప్పగించి వుంటే, సినిమా ఇంకా బాగా వచ్చివుండేద'ని ఒక పత్రికకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. ఇది చేదు నిజం!

## కన్యాశుల్కం చిత్రం గురించి వచ్చిన సమీక్షలు

1. మంచి పాటను గుర్తుచేశారు... కంగ్రాట్స్ - వే.ఆ.కృ.రంగారావు, నవ్య, 22.02.2006
2. ఆదిలో తిరస్కారం... ఆపై పురస్కారం... కన్యాశుల్కం (ఒక తీపి జ్ఞాపకం - అయిష్టంగానే చేసినా అన్యాయం చేయలేదు - మధురవాణి ఇక్కట్లు) - నవ్య, 18.06.2008
3. కన్యాశుల్కం కబుర్లు - పాతబంగారం - రావికొండలరావు - సితార - 14 అక్టోబర్ 2012.
4. కమనీయ కళాఖండం - వినోదావారి 'కన్యాశుల్కము' - ఆంధ్రప్రభ వార పత్రిక, 07.09.1955.

# కన్యాశుల్కం కబుర్లు

**- రావికొండలరావు**

తెలుగులో మంచి నాటకాలు అనిపించుకున్నవి కొన్ని సినిమాలుగా రూపం సంతరించుకున్నాయి. సాంఘికాలు కూడా కొంతవరకూ వచ్చాయి. 'వరవిక్రయం' నాటకంలోని సమస్య ఈనాటి వరకూ ఇంకా ఉండనే ఉంది. ఆనాడు, అది సినిమాగా తీశారు (1939) ప్రజాదరణ పొందింది. గురజాడ అప్పారావుగారు రాసిన 'కన్యాశుల్కం' సాంఘిక నాటకాల్లో అగ్రగణ్యమైంది. దాన్ని కూడా సినిమా చెయ్యాలని కొందరు అప్పట్లో అనుకున్నారుగాని, ఆ సమస్య ఇప్పుడు లేదని వదిలేశారు. ఆడపిల్ల తల్లిదండ్రులు డబ్బు కోసం ముసలాళ్లకు కట్టబెట్టేవారు. ఆ ముసలాడు చస్తే ఆ ఆస్తిపాస్తులు పిల్లకి వస్తాయి. పిల్ల ఇంకా ఆరేళ్లది గనక, తండ్రికే సొంతం. ఆ పిల్ల బాల వితంతువు. చదువూ, సంధ్యా చెప్పించకుండా మూల కూచోబెట్టేవారు. అంటే చాకిరీ చేయించుకునేవారు. అలాంటి పిల్లలకి యుక్త వయసు రాగానే వివాహాలు చేసి, వాళ్ల జీవితాల్ని వికసింపజెయ్యాలని సంఘసంస్కర్తలు ఆలోచనలు చేశారు. కందుకూరి వీరేశలింగం గారు బాల వితంతువులకి వివాహాలు చేసే ఉద్యమం అరంభించారు. బాల్య వివాహాలు నిషేధించాలన్నారు. సంఘ సంస్కర్తల ప్రోద్బలం వల్ల నాటి శాసనసభలో చట్టం ప్రవేశపెట్టారు. అయినా, రహస్యంగా వివాహాలు జరుగుతూనే ఉండేవి. గురజాడవారు ఈ సమస్య తీసుకొని 'కన్యాశుల్కం' పేరుతో, వ్యావహారిక భాషలో హాస్యం మిళాయించి నాటకంగా రాశారు. ఆ నాటకం గొప్ప స్ఫూర్తి కలిగించింది. ప్రభుత్వ చట్టం, ప్రబోధాలు చెయ్యలేకపోయినది నాటకం సాధించింది. నిదానంగా, బాల్యవివాహాలు ఆగిపోయాయి. ఉన్న బాల వితంతువులకి పునర్వివాహాలు చేశారు. నిదానంగా ఆ సాంఘిక దురాచారం అంతరించిపోయింది. వరకట్న సమస్యలాగా కొనసాగలేదు. అందువల్ల 'కన్యాశుల్కం' నాటకాన్ని సినిమా చేసి ఏం ప్రయోజనం? అని సినిమా పెద్దలు ఊరుకున్నారు కాని, నిర్మాత డి.ఎల్.నారాయణ ఊరుకోలేదు. క్లాసిక్ అనిపించుకున్న ఆ నాటకాన్ని సినిమాగా తియ్యాలని ఆశించారు. "ఇది చరిత్ర. నాటి సాంఘిక వ్యవస్థ ఎలా ఉందో ఈనాటి తరానికి తెలియాలి కదా" అని 1952లో 'శాంతి' సినిమా తీసినప్పుడే అనుకున్నా, 'దేవదాసు' (1953) నిర్మించారు. ఇది కూడా క్లాసిక్కే. పైగా విషాదాంతం. సాహసించి సినిమా చేస్తే అది 'సూపర్‌హిట్', 'బంపర్‌హిట్' అయింది. ఆ ఉత్సాహంతో డి.ఎల్. 'కన్యాశుల్కం' నిర్మించడానికి సిద్ధపడ్డారు. తనకి తొలి నుంచి బాగా తెలిసి ఉన్న నాగేశ్వరరావుని గిరీశం పాత్ర ధరించమని అడిగితే, డి.ఎల్. మాట తోసేయలేక, నాగేశ్వరరావుగారు ఆలోచన చేసి, చేసి, తిరస్కరించారు. "అది నెగిటివ్ పాత్ర. నా భావి సినిమా జీవితానికి సహాయం చేసే పాత్ర కాదు" అని తిరస్కరించారు. ఎన్.టి.రామారావు ఆ పాత్ర వేశారు. అయితే, గురజాడ రాసిన 'కన్యాశుల్కం' నాటక కథకీ, సినిమా కథకీ తేడా ఉంది. అందుకే సినిమా టైటిల్స్‌లో 'మహాకవి గురజాడ అప్పారావు రాసిన 'కన్యాశుల్కం' నాటకాన్ని అనుసరించి తీసిన సినిమా' అన్నట్టుగా రాశారు. నాటకంలో ఉన్న పాత్రలే సినిమాలోనూ ఉన్నాయి. కాని, రెండో భాగంలో బాగా మార్పు చేశారు. అసలు, గిరీశం పాత్ర పచ్చి మోసగాడు, కోతలరాయుడు. నాటకాంతంలో తను వేసిన పథకాలన్నీ తారుమారు కాగా, జీవితంలో ఓడిపోయి – "డామిట్! కథ అడ్డం తిరిగింది" అని నిష్క్రమిస్తాడు. మనిషి మారాడా లేదా అన్నది గురజాడవారు పాఠకులకీ, ప్రేక్షకులకీ వదిలేశారు. సినిమాలో అగ్నిహోత్రావధాన్లు పశ్చాత్తాపపడి గిరీశం, బుచ్చమ్మల వివాహానికి అంగీకరిస్తాడు. అగ్నిహోత్రావధాన్లు మూర్ఖుడు. అంత సులభంగా రాజీపడడు. అలాంటి మూర్ఖుడిలో పరివర్తన రావడానికి అవకాశం లేదు. కాని సినిమా కాబట్టి మోసగాడైన గిరీశాన్ని క్షమించేస్తాడు. లుబ్ధావధాన్లు పాత్ర కూడా అంతే! చావ సిద్ధంగా ఉన్న ముసలాడు, ఎనిమిదేళ్ల పిల్లని పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడతాడు. ఎంత చెప్పినా వినడు. ఆ పెళ్లి తప్పించాలని కరటకశాస్త్రి తన శిష్యుడి చేత ఆడ వేషం వేయించి, పెళ్లి జరిపించి, లుబ్ధావధానుల్లో పరివర్తన కలిగేలా చేస్తాడు. ఇదంతా సినిమాలో, అలాగే ఉంది. కన్యాశుల్కానికి 'అనుసరణ' అన్నారు కాబట్టి 'కన్యాశుల్కం' సినిమాని సినిమాగా చూసినప్పుడు 'బాగుంది'

అనీ, 'మంచి సినిమా' అనీ అనిపిస్తుంది.

పి.పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఆగస్టు 26వ తేదీన 1955లో విడుదలైంది. 'కన్యాశుల్కం' నాటకం మీద ఎంతో భక్తి గలవాళ్లకి సినిమా నచ్చలేదు. నాటకం తెలియని వాళ్ళకి సినిమాగా నచ్చింది. గురజాడ ఈ నాటకాన్ని 1909లో రాశారు. నాటి సాంఘిక పరిస్థితులు, పరిసరాలు, దుస్తులు, ఇళ్లు అన్నీ సినిమాలో ప్రతిబింబించాయి. నాటకంలోని మొత్తం సంభాషణలు విజయనగరం మాండలికంలోనే ఉంటాయి. పాత్రలన్నీ ఆ ప్రాంతంలోనివే గనక భాషలో విజయనగరం పలుకు వినిపించాలి. కాని, అది జరగడం కష్టం. అందుకే చాలావరకు సంభాషణలు వేరే రాయించారు.

నాటకంలోని దృశ్యాల్ని కొన్ని వదిలేసి, ఉన్నవాటిని అటూ ఇటూ చేసి, వెంపటి సదాశివబ్రహ్మం కొత్త సన్నివేశాల్ని కల్పించి తిరగరాశారు. చాలావరకూ అప్పారావు గారి సంభాషణలే ఉన్నా అప్పారావుగారు 'కన్యాశుల్కం'లో చేసిన ప్రయోగం ఏమిటంటే – నాటకంలో కనిపించవలసిన 'హీరోయిన్' అగ్నిహోత్రావధాన్లు రెండో కూతురు సుబ్బి. కాని, నాటకం మొత్తం మీద సుబ్బి ఎక్కడా కనిపించదు. సినిమాలో ఆ పాత్రను చూపించారు. అలాగే ఇన్స్‌పెక్టర్ లాంటి పాత్రల్ని కూడా సినిమాలో ప్రవేశపెట్టారు.

ముఖ్యపాత్రల్లో గిరీశం – ఎన్.టి.రామారావు, మధురవాణి – సావిత్రి, లుబ్ధావధాన్లు – గోవిందరాజు సుబ్బారావు, రామప్పంతులు – సి.ఎస్.ఆర్., అగ్నిహోత్రావధాన్లు – విన్నకోట రామన్నపంతులు, కరటకశాస్త్రి – వంగర వెంకటసుబ్బయ్య, సౌజన్యరావు పంతులు – గుమ్మడి వెంకటేశ్వరరావు, బుచ్చమ్మ – షావుకారు జానకి, పూటకూళ్లమ్మ –ఛాయాదేవి, వెంకమ్మ – హేమలత, పూజారి గవరయ్య – అద్దాల నారాయణరావు, హెడ్ కానిస్టేబుల్ – పేకేటి శివరామ్, సిద్ధాంతి – గౌరీపతిశాస్త్రి, వెంకటేశం – కుందు, శిష్యుడు మహేశం – సుధాకర్.

సంగీతం – ఘంటసాల, ఛాయాగ్రహణం – ఎన్.ప్రకాశ్, కళ – గోడ్‌గాంకర్, వాలి, నాట్యాలు – పసుమర్తి కృష్ణమూర్తి, మేకప్ – హరిబాబు, నాగేశ్వరరావు.

**విశేషాలు:** లుబ్ధావధాన్లుగా అత్యద్భుతంగా నటించారు గోవిందరాజు సుబ్బారావు. అయితే రంగస్థలమ్మీద మాత్రం ఆయన గిరీశంగా, స్థానం నరసింహారావు మధురవాణిగా నూరుకి పైగా ప్రదర్శనలిచ్చారు. సావిత్రి మధురవాణిగా, జానకి బుచ్చమ్మగా ప్రతిభావంతులైన నటన చూపించారు. రామప్పంతులు ఇంటికి లుబ్ధావధాన్లు వచ్చిన ఘట్టంలో సావిత్రి, నవ్విన నవ్వు కోసం ఇంకొకసారి వెళ్లి చిత్రం చూసినవాళ్లున్నారు!

గురజాడ వారి రచనలు – 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' నృత్య రూపకం చూపించడం – ఔచిత్యం. ప్రమీలారాణి అనే బాలనర్తకి పూర్ణమ్మ పాత్ర ధరించింది. 'బొమ్మల పెళ్లి' నాట్యంలో – నటీమణి శారద పాల్గొనడం విశేషం. సినిమాల్లో ఆమె తొలిసారి కనిపించడం ఇదే. శ్రీశ్రీ ఎప్పుడో రాసిన 'ఆనందం అర్ణవమైతే, అనురాగం అంబరమైతే' గేయాన్ని ఈ చిత్రంలో వాడారు. సావిత్రి నాట్యం చేస్తుంది.

కథ విజయనగరం ప్రాంతంలో జరిగిందని, విజయనగరం రాజావారి కోట, వీధులు, ఇళ్లు – షూట్ చేసి చిత్రంలో చూపించారు.

గురజాడ అప్పారావుగారి 150వ జయంతి ఉత్సవాలు రాష్ట్రమంతటా వైభవంగా జరిగాయి. ముఖ్యంగా విజయనగరం, హైదరాబాదుల్లో సెప్టెంబర్ 21 గురజాడ జన్మదినోత్సవం చేస్తూ – రాష్ట్రమంతటా అన్ని పాఠశాలల్లోనూ సరిగా ఉదయం 11 గంటల సమయానికి – గురజాడ వారి దేశభక్తి గీతాన్ని (దేశమును ప్రేమించుమన్నా) ఆలపించారు! ఒక మహత్తర నాటకాన్ని అనుసరించి, సినిమా రూపం పొందిన 'కన్యాశుల్కం' గురించి ఒకసారి స్మరించుకోవడం కర్తవ్యం. వినోదా సంస్థ పేరు మీద డి.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని రేవతి, నరసు, వీనస్, నెప్ట్యూన్ స్టూడియోల్లో నిర్మించారు.

– సితార, 14 అక్టోబర్ 2012

రామప్పంతులు మోసం గ్రహిస్తాడు. లుబ్ధావధాన్లు పెళ్ళి కూతుర్ని ఖూనీ చేశాడని రామప్పంతులు కేసు పెట్టిస్తాడు. ఆ కేసు సందర్భంలో రామప్పంతులు, మధురవాణి, లుబ్ధావధాన్లు అంతా విశాఖపట్నం చేరుకుంటారు. విశాఖపట్నంలో సౌజన్యారావు పంతులు (గుమ్మడి) అనే వకీలు లుబ్ధావధాన్లను యెలాగేనా కాపాడాలనుకుంటాడు. మధురవాణి కూడా సౌజన్యారావుతో అసలు నాటకమంతా కరటకశాస్త్రి ఆడిందేనని చెబుతుంది. గిరీశం బుచ్చమ్మను యేవిధంగానేనా చెరపుదామనుకుంటాడుగానీ పెళ్ళాడితేనే గానీ మీద చెయ్యి వెయ్యడానికి వీల్లేదని బుచ్చమ్మ ఖండితంగా అనగానే గిరీశం సౌజన్యారావు వద్దకు వెళ్ళి ఆయన సలహాపై బుచ్చమ్మను పెళ్ళాడదామనుకుంటాడు. అక్కడ మధురవాణి గిరీశం అసలు రంగు బయటపెడుతుంది. సౌజన్యారావు గిరీశాన్ని చూచి అసహ్యించుకొని పొమ్మంటాడు. 'డామిట్ కథ అడ్డంగా తిరిగింది' అని నిరుత్సాహంతో గిరీశం పోబోతాడు. నాటకంలో కథ అంతటితో అంతమవుతుంది. మధురవాణి ప్లీడరు గారితో బుచ్చమ్మ నెలాగా లేవదీసుకువచ్చాడు కాబట్టి ఆమెను వివాహం చేసుకోమని గిరీశంతో చెప్పమంటుంది. సౌజన్యారావుగారు కూడా ఆమె సలహాను అంగీకరించి గిరీశం, బుచ్చమ్మల వివాహం జరుపుతారు. ఈ వివాహ ఘట్టం కొత్తగా చేర్చారు. చిత్రంలో కథ సుఖాంతం చేయడం బాగానే వుంది. చివరకు అగ్నిహోత్రావధాన్లు కూడా బుచ్చమ్మ పునర్వివాహానికి ఒప్పుకుంటాడు. లుబ్ధావధాన్లు తన ఆస్తిలో సగం పెళ్ళికూతురు వేషం వేసిన మహేశానికిచ్చి సుబ్బమ్మను అతనికిచ్చి వివాహం చేయమని అగ్నిహోత్రావధాన్లను కోరతాడు. మిగిలిన ఆస్తి లుబ్ధావధాన్లు వితంతు వివాహ సంఘానికి విరాళంగా యిస్తాడు.

అసలు నాటకంలో మధురవాణి పాత్ర ప్రాణం వంటిది. తరువాత గిరీశం పాత్ర లెక్కకు వస్తుంది. ఈ రెండు పాత్రలలోనూ ఆది నుండి అంతం వరకు హాస్యం ఉట్టిపడుతూ వుంటుంది. చిత్రంలో కథాగమనానికే దర్శకుడు యెక్కువ ప్రాధాన్యమిచ్చారు గానీ పాత్ర పోషణయందు పాత్రలకు కావలసిన సంభాషణలయందు మరింత యెక్కువ శ్రద్ధ వహిస్తే బాగుండును. అసలు నాటకం దృష్టితో చూస్తే గిరీశం, మధురవాణి పాత్రలు వుండవలసినంత చక్కగా లేవనిపిస్తుంది. కానీ ఆ నాటకంలోని చేసినదంతా చిత్రంలో తేవడం అసాధ్యమేనేమో!

"పుత్తడి బొమ్మ పూర్ణమ్మ" పాట చిత్రీకరణం చాలా బాగుంది. "ఆనందం అర్ణవమైతే" అనే గీతం కుమారి సుశీల చక్కగా పాడింది. అగ్నిహోత్రావధాన్లుగా శ్రీ రామన్నపంతులు, లుబ్ధావధాన్లుగా శ్రీ డా॥ సుబ్బారావు, రామప్పంతులుగా శ్రీ సి.యస్.ఆర్., కరటకశాస్త్రిగా శ్రీ వంగర అత్యుత్తమంగా నటించారు. గిరీశంగా శ్రీ ఎన్.టి.రామారావు, మధురవాణిగా కుమారి సావిత్రి సంతృప్తికరంగా నటించారు. బుచ్చమ్మగా శ్రీమతి జానకి అతి సహజంగా నటిస్తూ ప్రేక్షక హృదయాలను ఆకర్షించగలిగారు. వెంకటేశంగా మాస్టర్ కుందు, మీనాక్షిగా శ్రీమతి సూర్యకాంతం, సౌజన్యారావుగా శ్రీ గుమ్మడి బాగానే నటించారు. తదితర పాత్రధారులు కూడా కడు సమ్మతితోనే తమ పాత్రలు నిర్వహించారు.

శ్రీ సదాశివ బ్రహ్మం రచన, సమీకరణ, శ్రీ పి.పుల్లయ్య దర్శకత్వం, శ్రీ ఘంటసాల సంగీతం బాగున్నాయి. కథా విధానంలో కొత్తదనం వుంది. ఇటువంటి కథ యింతవరకు తెరకెక్కలేదు. సుప్రసిద్ధమైన యీ నాటకాన్ని వినోదావారు పండిత పామరులకు వినోదదాయకంగానూ, ఆకర్షణీయంగానూ వుండేట్లు శాయశక్తులా తంటాలుపడి తయారు చేశారు. "ఇటువంటి క్లిష్టమైన నాటకాన్ని వినోదావారు విజయవంతంగానే చిత్రీకరించారని చెప్పాలి. గురజాడవారి నాటకానికి వినోదావారు సాధ్యమైనంతమట్టుకు న్యాయం చేకూర్చారనే అనాలి. సాహసించి ఇటువంటి ప్రయత్నాన్ని చేసినందుకు వారిని అభినందిస్తూ చిత్రం ఘన విజయాన్ని సాధిస్తుందని ఆశిస్తున్నాం.

– ఆంధ్రప్రభ వారపత్రిక, 07.09.1955